


శంకరం అంటే మా ఆఫీసుకి బదిలీమీద కొత్తగా వచ్చిన టైపిస్టు. మనిషి చాలా ఆడంబరంగా ఉంటాడు. డింఢిమభట్టారకుడిలా కంచుఢక్కా లేకపోయినా, ఖంగుమనిపించే గొంతుతో సొంతగొప్పలతో చెవులు రింగుమనిపిస్తాడు. త్వరలోనే ఈ శాల్తీ అంటే



# బహుమతి

అందరికీ వెగటు పుట్టింది. అతన్ని చూడగానే మొహాలు తిప్పేసుకుని సీరియస్‌గా పనులు చేసుకోవటం, పలకరించినా వినబడనట్లు నటించటం మొదలుపెట్టారు. ఇహ వేరే దారి లేక తనుకూడా తన గొడవ చూసుకోసాగేడు. అతని అదృష్టం పండి, మా ఆఫీసుకి అతని దూరపు బంధువు అధికారిగా వచ్చాడు. ఆయన పేరు కృష్ణమూర్తి.

అంతే! ఇక శంకరం విజృంభించేసాడు.

ఆయనతో అతి చనువుగా మసుల్తూ, స్టాఫ్ మీద ఉన్నవీ లేనివీ పుల్లింగాలు చెప్పసాగేడు.

కృష్ణమూర్తి మూర్ఖాతి మూర్ఖుడు గనుక శంకరం చెప్పినవన్నీ నమ్మి, స్టాపుతో గొడవలు పెట్టుకోసాగేడు. అతనికి వేరే పనులేమీ చెప్ప కుండా కేవలం స్టాపు మీద గూఢచారి చర్యలు చేయమని, ఎప్పటికప్పుడు అన్ని విషయాలూ తనతో చెబుతుండమనీ పురమాయించాడు కృష్ణ మూర్తి.

స్టోరు కీపరు సుబ్బారావు చాలా ఖరాఖండీ మనిషి. మాట అనడు, తను పడడు. అతనికీ శంకరానికీ స్టోర్సు వ్యవహారంలో మాటామాటా పట్టింపు వచ్చింది.

దాంతో కృష్ణమూర్తి దగ్గర సుబ్బారావు మీద చాడీలు చెప్పాడు. కృష్ణమూర్తి తనకి ఉద్యోగం ద్వారా సంక్రమించిన అధికారాలన్నీ సుబ్బా రావు మీద చూపించాడు. ఓ విధంగా అతన్ని హింస పెట్టటానికి పూనుకున్నాడు.

సుబ్బారావుకి కోపం వస్తే తారాస్థాయే గనుక అతని అరుపులకి, కేకలకీ ఫాన్లు గజగజ లాడాయి. బీరువాలు బిక్కుబిక్కుమన్నాయి. బల్ల లు బేలగా చూసాయి.

స్టాపుకి అతని సంగతి తెలుసు గనుక ఏమీ పట్టనట్లు తమ పనిలో తాముండిపో యారు.

కృష్ణమూర్తి 'మెమోల' పర్వం మొదలెట్టాడు.

దాంతో సుబ్బారావు ఇంకా రెచ్చిపోయాడు.

కృష్ణమూర్తి మతిమరుపు మనిషి. ఆఫీసు వ్యవహారాల్లో అనేక తప్పులు చేస్తుంటాడు. స్టోర్సు విషయంలో కూడా చాలా అజాగ్రత్తగా ఉండడం వల్ల అనేక పొరబాట్లు దొర్లాయి. ఇవన్నీ కాగితంపై పెట్టి, పై అధికార్లకి రాసాడు సుబ్బారావు.

ఇలా మొదలయిన యుద్ధం సుబ్బారావుకి ఛార్జిషీట్లు ఇచ్చేవరకూ సాగింది. ఈ యిద్దరి గొడవతో పై అధికార్లు విసిగిపోయారు. రెండు సార్లు ఎంక్వయిరీకి వచ్చారు. ఇద్దరి వాదనలూ బలంగా ఉండేవి. నిస్సహాయంగా తిరిగి వెళ్ళి పోయారు. ఆఖరు అస్త్రంగా కృష్ణమూర్తిని పార్వ తీపురం ఆఫీసుకి బదిలీ చేసి చేతులు దులుపు కున్నారు పై అధికార్లు.

శంకరం చెరువు బయట చేపలా అయిపో

**కేఆర్టీ**

యాడు. చుట్టూ నోళ్లు తెరుచుకు నవ్వుతున్న కొంగల్లాగ స్టాఫు!

వెంటనే నెలరోజులు 'సిక్‌లీవు' పెట్టేసాడు.

అందరూ హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

దుష్టుడికి తగిన గుణపాఠం లభించింది కదాని సంతోషపడ్డారు.

కొందరయితే శంకరం పోకడల్ని, మాటల్ని అనుకరించి హాస్యం సృష్టించారు.

సరిగ్గా నెలకాగానే శంకరం ఆఫీసుకు హాజరయ్యాడు. అయితే కొద్ది నిముషాలు అతన్ని ఎవరూ పోల్చుకోలేదు. కారణం... తిరుక్షవరం, తిరుపతి లడ్డూతో లాల్చీపైజమాలలో ప్రత్యక్షమయ్యాడు. రాగానే గతమంతా మర్చిపోయినట్లు, అందర్నీ నవ్వుతూ పలకరించి, ప్రసాదం పంచిపెట్టాడు. ఆశ్చర్యపోతూనే ప్రసాదం నోట్లో వేసుకున్నారు. ప్రసాదం తియ్యగానే ఉంది. కాబట్టి కల కాదు నిజమే అని రూఢీ చేసుకున్నారు.

తిరుపతి విశేషాలు మరీ మరీ అడిగి తెలుసుకున్నారు స్టాఫు. ఓపిగ్గా అన్నీ చెప్పి, ఆఖర్న అందరికీ చిన్న 'షాక్' యిచ్చాడు. త్వరలో తను ప్రేమ వివాహం చేసుకోబోతున్నాట్ట. ఆ అమ్మాయి తిరుపతిలో పరిచయం అయిందిట.

'ఇంతకీ పెళ్లి ఎప్పుడు, ఎక్కడ?' అని ప్రశ్నల వర్షం కురిపించారు స్టాఫు.

"పెళ్లి వచ్చేవారమే! తిరుపతిలో జరుగుతుంది. రిసెప్షన్ మన ఊళ్లోనే ఈ నెల ఇరవై



కృష్ణాజిల్లా రచయితల సంఘం అధికారిక వెబ్‌సైట్ 'తెలుగుపసిడి డాట్ కామ్' ఆవిష్కరణ సభలో అను ఫాంట్స్ అధినేత శ్రీ మురళీకృష్ణను సన్మానిస్తున్న ప్రస్తుత రాష్ట్ర మంత్రి శ్రీ మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర హిందీ అకాడమీ అధ్యక్షులు డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

ఆరో తారీఖున..." అన్నాడు.

అందరూ అభినందనలు చెప్పి, భుజం తట్టారు.

శంకరం కాబోయే భార్యపేరు కాకతాళీయంగా 'పార్వతి' కావటం అందరికీ మరింత చర్చనీయాంశమైంది. కొత్త కాపురానికి కావాల్సిన ముఖ్యమైన సామానులు కొని, అందమైన ప్యాక్ చేయించి, రిసెప్షన్‌లో యివ్వటానికి మోసుకెళ్లారు.

రిసెప్షన్ హాలుకి దాదాపు రావల్సిన వాళ్లంతా వచ్చేసినట్లే. కేవలం యిద్దరు తప్ప! వాళ్లు నూతన దంపతులు. అది హోటల్ 'కాన్ఫరెన్స్ హాల్'. అందువల్ల అక్కడ అతిథి మర్యాదలకి లోటులేదు. అందరూ నూతన దంపతుల కోసం మధ్యమధ్య ఎదురుచూస్తూ, గలగల మాట్లాడుతూ, సర్వర్లు అందించినవన్నీ ఆరగించసాగారు. అంతలో భోజనం కూడా వచ్చేసింది.

అందరూ ఆశ్చర్యపోతూ "అరే... శంకరం దంపతులేరీ..." అనుకున్నారు. "తిందాం పట్టండి... యిప్పటికే చాలా లేటయింది..." అనే మాటలతో అందరూ ఏకీభవించారు. అది కూడా పూర్తయింది! అతిథులందరూ ఆతృతగా నూతన దంపతుల కోసం నిరీక్షిస్తున్నారు. గడియారం గంటలు కొట్టినప్పుడల్లా ఉలిక్కిపడుతున్నారు.

అంతలో డోరు తీసుకుని ఒక వృద్ధ దంపతులు, వాళ్లలో బాటు మూడేళ్ల పసివాడు, లోపలికి వచ్చారు. వాళ్ల వెనుక శంకరం దంపతులు!... 'అమ్మయ్య' అనుకుని అందరూ చప్పట్లు కొట్టారు. వాళ్లంతా వేదిక మీదకి వెళ్లి అందరికీ నమస్కారాలు చేసారు.

"ఆలస్యానికి క్షమించండి. నేను శంకరం గారి మామగార్ని. ఈవిడ మా ఆవిడ. ఈ పిల్లాడు మా మనమడు. అంటే పార్వతి కొడుకు గణేష్. మీకు తెలియాల్సిన విషయం ఏమిటంటే - పార్వతికిది రెండో పెళ్లి! ఒక యాక్సిడెంట్‌లో భర్తపోయాడు. అప్పటికే గణేష్ ఏడాది పిల్లాడు. దైవికంగా, దైవ సన్నిధిలో శంకరం గారితో మా పార్వతి పరిచయం అయింది. పరిణయానికి దారితీసింది! గణేష్ విషయం చర్చిస్తుండగా యిలా ఆలస్యమైంది! చివరికి మీ ముందు వాస్తవాలు వెల్లడించాలని నిర్ణయించాం..."


## తారల అడ్రసులు

**వై.కె.మూర్తి**, దాసరివారి వీధి, సూర్యారావు పేట, విజయవాడ-2 కు రూ. **20/-** లు ఎం.ఓ. చేయండి. సినీ నటీనటుల అడ్రసులతో పాటు ఒక జోక్స్ పుస్తకం కూడా పంపబడును.


"ఆ తర్వాత నేను చెబుతాను..." శంకరం అందుకున్నాడు.

"మీరందరూ అభిమానంగా ఎన్నో కానుకలు తెచ్చారు. అందుకు చాలా థాంక్స్. గణేష్‌ని భగవంతుడిచ్చిన బహుమతిగా భావించి, యీ రోజు నుంచే మా జీవితంలోకి, మీ అందరి సమక్షంలో ఆహ్వానిస్తున్నాను..."

ఆ మాటలకి అందరూ మనస్ఫూర్తిగా చప్పట్లు కొట్టారు. శంకరం గణేష్‌ని ఎత్తుకుని అందరికీ నమస్కారాలు చేయించాడు.

క్రిందకి దిగబోయేముందు గణేష్ చటుక్కున శంకరం బుగ్గమీద ముద్దుపెట్టి, అందర్నీ నవ్వులతో ముంచెత్తాడు.